# దేశభక్తి

ఎస్. ఉషాపద్మిని

**'నానమ్మా, ఇంకా సినిమా అయిపోలేదు అప్పుడే నిలబడ్డా వెందుకు? కూర్చో'' గుసగుసగా అంటూ శాంతమ్మగారి చేయి పట్టుకుని లాగింది ఏడేళ్ల సుస్మిత. దానికి శాంతమ్మగారు ఏదో అనబోతుంటే ''అమ్మా, అన్ని విషయాలు తర్వాత చెప్పచ్చు ముందు నువ్వు కూర్చో. నువ్వలా నిలబడితే నీ వెనకాల వారికి ఇబ్బంది'' విసుక్కున్నాడు కొడుకు రాఘవ. ఇంక చేసేదేం లేక నిట్టూరుస్తూ కూర్చుంది శాంతమ్మ.**

శాంతమ్మ ఒక ప్రభుత్వ పాఠశాలలో టీచరుగా పనిచేసి ఏడాది క్రితమే రిటైరయ్యింది. నాలుగు రోజుల క్రితమే కొడుకునూ, మనవలనూ చూడాలని హైదరాబాద్ వచ్చింది. వచ్చిన క్షణం నుంచీ కొడుకు ఇంటి వాతావరణం ఆమెకు అస్సలు నచ్చలేదు. కొడుకు, కోడలు ఉద్యోగం చేయడంలో తెల్లవారుఝామునే లేచి తయారయ్యి ఎనిమిది గంటలకల్లా ఆఫీసుకి పోవడం, మనవడు, మనవగాలు స్కూళ్ళకి పోవడం మళ్ళీ రాత్రి ఏడు గంటలకు పిల్లలకు ట్యూషన్లు, పెద్దవారికి ఓవర్ టైములయ్యాక కలుసుకోవడం. ఇంటికి రాగానే ఎవరిపని వారిది. భోజనం టైముకు కలుసుకున్నా అప్పుడూ కోడలు రాధ అనుక్షణం అందరికీ గుర్తుచేస్తూ హెచ్చరిస్తూ ఉంటుంది. త్వరగా కానివ్వండి రేపు మళ్లీ పొద్దున్నే లేవాలి అంటూ. అవన్నీ ఎలా ఉన్నా శాంతమ్మగారికి చేస్తున్న మర్యాదలకి లోటు లేదు.

మనవలిద్దరి ప్రవర్తన మరీ దారుణం. ఇద్దరూ తెలుగన్నది లేకుండా ఇంగ్లీషులోనే మాట్లాడుకోడం, టి.విలో ఇంగ్లీష్ ఛానల్స్ పెట్టుకుని చూడడం. కానీ వచ్చిన వెంటనే నీతి బోధలు చెప్పడం తగదని ఊరుకున్నా ఇంక అరోజు సినిమా అయ్యాక ఇంటికెళ్ళాక మాత్రం ఊరుకోలేకపోయింది శాంతమ్మ.

'ఏరా, సినిమా హాల్లో పిల్లకేదో తెలియక నన్ను కూర్చోమంటే, నీకు ఏమయింది అలా అన్నావు. అయినా మీ నాన్నగారు నీకు నూరిపోసిన సంస్కారం ఇంత త్వరగా మర్చిపోయావురా? జాతీయ గీతం వినిపిస్తుంటే లేచి నిలబడి దేశంపై మనవంతు గౌరవం చూపలేని రోజులొచ్చాయా?'' సున్నిత మనస్కురాలు కావడంతో శాంతమ్మ కళ్ళ నుంచి నీళ్ళు వచ్చాయి.

కోడలు రాధ మామూలే ఏం మాట్లాడలేదు. రాఘవ మాత్రం పిల్లల ఎదురుగా తను చేసిన పని సమర్థించుకుంటూ 'అదికాదమ్మా, ఎందుకంత ఆవేశపడతావు! జస్ట్ కూల్‌డౌన్? బీ ఏ రోమన్ ఇన్ రోమ్ అని ఎప్పుడో అన్నారు. మనకే కాదు జాతీయ



గీతాన్ని గౌరవించాలని హాల్లో ఇంకొంతమందికి తెలుసుంటుంది కదా! వాళ్లెందుకు నిలబడలేదు. అందరూ నడిచే దారిలోనే మనం నడవాలి. లేకుంటే ఈ సిటీలో గొడవలు, కొట్లాటలు వస్తాయి. అయినా అప్పటికే నీ వెనకాల సీట్లో కూర్చున్నావిడ ఎంత సణిగిందో తెలుసా?'' అన్నాడు.

''అదికాదురా ఎవరూ చేయలేదని మనమూ మానేస్తే ఎలా? మన దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం కూడా ముందు ఎవరో ఒకరు మొదలుపెడితేనే కదా ఆరంభమైంది. తర్వాత ఆ పోరాటం ఎంత బలం సంతరించుకుని ఎంతమంది తమ ప్రాణాలు త్యాగం చేస్తే మన కీనాడు ఈ స్వాతంత్ర్యం అనుభవించే అదృష్టం కల్గింది. ఎవరో ఏదో చేయట్లేదని కాక మనమే ఆరంభించాలి నాన్నా. పెద్ద చెట్టు కూడా చిన్న విత్తనం నుంచి వచ్చిందే కదా'' అంది శాంతమ్మ తన పట్టు విడవకుండా.

''అబ్బ అమ్మా, నువ్వు మరీ చాదస్తంగా మాట్లాడకు. ఇప్పుడు నువ్వు చెప్పే జాతీయగీతం ఈ సినిమాలో పిక్చరైజ్ చేసినది ఎంత ఖర్చుపెట్టి తీసారో తెలుసా. ఆ పిక్చర్‌కి మనం వెళ్ళిన క్లాసుకి టిక్కెట్టు ఎంతో తెలుసా! వందరూపాయలు. అయినా ఆ సినిమా ఊర్లో ఈ ఒక్క థియేటర్లో ఉందని ఎక్కడెక్కడినుంచో ఎడ్వాన్స్ బుకింగ్‌లు చేసుకుని బ్లాకులో టిక్కెట్లు కొనుక్కొని వచ్చి చూస్తున్నారు. అంత శ్రమపడి చూస్తున్నవారికి ఈ హిత బోధలు చేస్తే వాళ్ళ ఫన్ స్పాయిల్ చేసామని మనని చెప్పు తీసుకుని కొడ్తారు. మాకామాత్రం తెలియదా, మీచేత చెప్పించుకునే స్థితిలో ఉన్నామా అంటారు. ఇప్పుడు కాలం మారింది. దానికి అనుగుణంగా మనం మారాలి అదే మంచిది. నువ్వు ఎక్కువ ఆలోచించక పడుకో. కిడ్స్ మీరూ వెళ్ళి పడుకోండి'' అని చెప్పి రాఘవ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

పడుకుందే గానీ శాంతమ్మకి నిద్రరాలేదు. రోజు రోజుకీ గౌరవం తగ్గుతున్న దేశమాత దీనంగా నిల్చుని కనిపించింది. వెంటనే ఆమె మనసులో గట్టిగా నిర్ణయించుకుంది. నాకు చేతనైనంతలో ఈ కాలం పిల్లలకి మన దేశం గురించి చెప్పి వారిలో దేశభక్తి పెంచాలి. అదే సరైనమార్గం. గట్టిగా నిర్ణయించుకుని నిశ్చింతగా నిద్రపోయింది.

మర్నాడు ఉదయాన్నే కొడుకు, కోడలు ఆఫీసులకు వెళ్ళిపోయారు. కానీ పిల్లలిద్దరూ ఇంట్లో ఉండిపోయారు. ''ఏమర్రా మీకు బడి లేదా?'' శాంతమ్మగారు అడగడంతో లేదు నానమ్మా మాకీరోజే కాదు త్రీ డేస్ వరుసగా హాలిడేస్ చెప్పారు.

టిఫిన్ తింటూనే టి.వి దగ్గర చేరిపోయారు ఇద్దరూ. ఏం చేస్తున్నారో అని వచ్చి చూసిన శాంతమ్మకి టి.విలో భీకరంగా కొట్టుకుంటున్న రెండు శాల్తీలు, ఎవరు గెలుస్తారో అని టెన్షన్ పడిపోతున్న మనవలు కన్పించారు. ''ఏరా పిల్లలూ ఇలాంటివి చూడకూడదు వేరేది చూడండి'' అనగానే మరో చెత్త ఛానల్‌పెట్టి ఇంకేదో చూడసాగారు. ''ఏరా మీరు తెలుగు ఛానళ్ళు చూడరా!'' శాంతమ్మ అడగానే ''లేదు నానమ్మా తెలుగు ఛానళ్లలో అన్నీ బోర్ సీరియల్స్, కావాలంటే చూడు'' ఒక ఛానల్ పెట్టాడు మనవడు కార్తీక్.

ఒక్కటి కాదు దాదాపు అన్ని ఛానల్స్‌లో అత్తా, కోడళ్ళ గొడవలు లేకుంటే ఏడుపు సీన్లు, పగలు ప్రతీకారాలు ఇవి చూడలేక ''టి.వి కట్టేసి ఇలా రండి మీకు మంచి మంచి విషయాలు చెప్తాను'' అంది శాంతమ్మ.

''ఉండు నానమ్మా రెజ్లింగ్ అయ్యాక వస్తాం'' అన్నారు ఇద్దరూ టి.వి నుంచి దృష్టి మరల్చకుండా ''సరే అలాగే చేయండి నేను రేపు మా ఊరు వెళ్ళిపోతాను'' అని అక్కడ్నుంచి తన గదిలోకి వెళ్ళింది శాంతమ్మ. ఆవిడ వెళ్ళిపోతుందనగానే భయపడి టి.వి ఆపేసి ఇద్దరూ ఆమె వెనకాలే వెళ్లారు.

ఇద్దర్నీ చెరోపక్కన కూర్చోబెట్టుకుని ముద్దుగా అడిగింది శాంతమ్మ ''ఏరా మీరు నాతో తెలుగులో మాట్లాడతారు కదా, మరి అమ్మ వాళ్లతో, మీలో మీరు తెలుగు మాట్లాడరేం?'' అంది.

''లేదు నానమ్మా! ఇక్కడ తెలుగులో మాట్లాడటం అలవాటైపోతే స్కూల్లో అదే మాట్లాడతామేమోనని భయం. స్కూల్లో మాట్లాడకూడదుగా'' అంది పెద్దదైన సుస్మిత.

'' ఏం అమ్మా తెలుగులో మాట్లాడితే ఏం!'' అంది ఆశ్చర్యంగా శాంతమ్మ.

''మరేమో మాది చాలా ఫేమస్ ఇంగ్లీషు మీడియం స్కూలు కదా! తెలుగులో మాట్లాడితే మాకు పనిష్మెంట్ ఇస్తారు.'' అన్నాడు కార్తీక్.

ఆ మాటలకు శాంతమ్మ బుగ్గలు నొక్కుకుంది. తెలుగువారందరం తెలుగే మాట్లాడుతాం అని ఒక పక్క టి.విల్లో మోతెత్తించే గవర్నమెంటు, ముందు ఈ కాలం పిల్లలకు తెలుగు నేర్చుకునే అవకాశం కల్పించాలి కదా. ఇంగ్లీషు రావడం మంచిదే. అది ఇంటర్నేషనల్ లాంగ్వేజ్ కానీ కనీసం ఒకటి రెండు క్లాసుల్లోనైనా తెలుగు మాట్లాడే అవకాశం ఇవ్వకపోతే ఇప్పటి పిల్లలకు తెలుగు ఎలా వస్తుంది. దేశ భాషలందు తెలుగులెస్స అంటారు కానీ ఇప్పటి పద్ధతి చూస్తుంటే కొంతకాలానికి తెలుగు మాట్లాడే వారి సంఖ్య లెస్ అయిపోతుందని భయంగా ఉంది. నిట్టూర్చింది శాంతమ్మ.

ఇంతలో తను అసలు వాళ్లను పిలిచిన కారణం గుర్తొచ్చి ''ఏరా మీకు మన జాతీయగీతం జనగణ మన.... తెలుసా'' అని అడిగింది.

''లేదు నానమ్మా మాకు తెలీదు'' అన్నారు ఇద్దరూ.

''మరి మీ స్కూల్లో ఏం పాడిస్తారు?'' అడిగిన ఆమె ప్రశ్నకి ఇంగ్లీషులో ఏదో పాడి ఇదే పాడిస్తారు అంది అమాయకంగా సుస్మిత.

శాంతమ్మకి బాధతో ఆవేశం వచ్చేసింది. కనీసం మన జాతీయ గీతం కూడా నేర్పని ఈ స్కూళ్ళెందుకు? చదువెందుకు? జాతీయ గీతం అంటే ఏంటో తెలియని ఈ జనరేషన్‌కి దానిని గౌరవించాలని ఎలా తెలుస్తుంది? దేశం గురించి కొంచెం కూడా అవగాహన కల్పించకపోతే వారిలో దేశభక్తి ఎలా ఏర్పడుతుంది. అందుకే ఎవరికి వారు మన భారత దేశం గొప్పతనం తెలుసుకోక అందని ద్రాక్షపళ్ళ కోసం ఇతర దేశాలకు ఎగబడి వెళ్తున్నారు.

మన స్వాతంత్ర్యం ఎంతో కష్టపడి సాధించినదని, దానిని నిలబెట్టుకోవాలనీ అనుకోక ఎవరంతట వారే ఇతర దేశాలిచ్చే డబ్బుకోసం వారికి గులాములు అవుతున్నారు. ఇదిలాగే కొనసాగితే కొంతకాలానికి.... వెంటనే రాష్ట్రపతికి లేఖ రాయడం ఆరంభించింది శాంతమ్మ. ఏ రాష్ట్రంలో ఆ భాషే మాట్లాడాలి. ఆ భాష తప్పనిసరిగా స్కూళ్ళల్లో నేర్పాలనే వ్యాసంతోపాటూ ముందుగా దేశంలో అన్ని స్కూళ్ళలో పిల్లలకి కనీసం జాతీయగీతం దాని ప్రాముఖ్యత తెలియజేయాలనే శాసనం చెయ్యమని. అది ఇంటర్నేషనల్ స్కూలు కానీ ఇంకే స్కూలు కానీ భారతదేశంలో ఉన్న ప్రతీ స్కూల్లో మన దేశానికి సంబంధించిన వివరాలు జనగణ మన, వందేమాతరం గీతాలు నేర్పమని ఆర్డరు పంపించమని.

ఆ లేఖ రాష్ట్రపతిని చేరి ఆ విన్నపం పరిశీలించి ఆ రకమైన శాసనం ఎప్పటికి అమల్లోకి వస్తుందో కానీ మనం మాత్రం మనకు చేతనైనంతలో ఈ కాలం పిల్లలకి మన దేశం గురించి అవగాహన కల్పించాలి. లేకుంటే కొంతకాలానికి గాంధీజీ ఎవరు? అసలు మనకు స్వాతంత్ర్యం ఎప్పుడొచ్చింది? అది పోరాడి సాధించిందా లేక ఎప్పట్నుంచో మనది స్వతంత్రదేశమేనా? అన్నా కూడా సమాధానం చెప్పలేని స్థితికి వారు తయారయ్యే ప్రమాదం ఉంది.

## మూడవ అవతారం



చిక్కటి గడ్డమూ, తలకు పాగా కట్టి కంచుకంఠంతో వున్న ఈ యోధుడెవరంటే నవజ్యోత్ సింగ్ సిద్ధూ. ఒకరకంగా అతనికి ఇది మూడో అవతారం. భారత్‌లో జరిగిన రిలయన్స్ క్రికెట్ కప్‌లో సిక్సర్ల సిద్ధూగా పేరుపొందిన సిద్ధూ క్రికెట్‌నుంచి నిష్క్రమించిన తరువాత బుల్లితెర వ్యాఖ్యాతగా ప్రత్యక్షమయ్యాడు. ఏవో ఒకటి రెండూ వ్యాఖ్యలతో వ్యతిరేకత వున్నా వ్యాఖ్యాతగా మంచిపేరే సంపాదించుకున్నాడు. వ్యాఖ్యాతగా రెండవ అవతారం కాగా ఇప్పుడు రాజకీయ నాయకుడిగా మూడవ అవతారమెత్తాడు. ఇటీవలే భాజపాలో చేరిన సిద్ధూకు స్వర్ణ దేవాయల కేంద్రంగా వున్న అమృతసర్ పార్లమెంట్ టిక్కెట్ ఇచ్చారు. తాను తప్పకుండా గెలుస్తానని ఈ సర్దార్జీ ఘంటాపథంగా చెబుతున్నారు.